క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో సీఎం కార్యదర్శి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సీఎం కార్యదర్శి, ఐఎఎస్ అధికారి ముత్యాల రాజు దంపతులు శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ముత్యాల రాజు దంపతులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో కేఎస్ రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు.

ముస్లింల సంక్షేమానికి కృషి చేయాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా రెండో విడత బాధ్యతలు స్వీకరించిన షేక్ ఆసీఫ్‌కు శుక్రవారం ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అభినందనలు తెలిపారు. లబ్బీపేటలోని కార్పొరేషన్ కార్యాలయంలో ఆసీఫ్‌ను కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘ ప్రధాన కార్యదర్శి హాఫీజ్ షేక్ సాజిద్ అలీ, షేక్ ఇమ్రాన్, పశ్చిమ నియోజకవర్గ ప్రతినిధి షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

మధురంగా సాగిన గాత్ర కచేరి



విజయవాడ కల్చరల్: గాయక సార్వభౌమ సంగీత పరిషత్, సంగీత సన్మండలి ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 140 వ జయంతి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సంగీత కచేరీ మధురంగా సాగింది. యువ సంగీత విద్వాంసురాలు విశాఖపట్నానికి చెందిన సోమయాజుల విష్ణుప్రియ శాస్త్రీయ సంగీతానికి పెద్దపీట వేస్తూ వాగ్గేయకారులు రచించిన సంకీర్తనలు మహాగణపతిం...తో ప్రారంభించి, పార్వతీ నిను, మామవ, శరవణభవ, గురువరం తదితర కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై పెవరలి నందకుమార్, మృదంగంపై మంగళగిరి శ్రీధర్, ఘటంపై మార్టూరి హరిబాబు సహకరించారు. సంగీత విద్వాంసులు అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు: ఆస్ట్రేలియాలో నివాసముంటున్న సంగీత విద్వాంసుడు కొరిడే సుదీర్ శర్మ గాత్ర కచేరితో ఉత్సవాలు ముగుస్తాయని కార్యదర్శి మోదుమూడి సుధాకర్ తెలిపారు.

అసమానతలు లేని ఆంధ్రప్రదేశ్ కోసం ప్రజల్లోకి..

ప్రజా ప్రణాళిక సమాలోచనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: అసమానతలు లేని ఆంధ్రప్రదేశ్ కోసం ప్రజా ప్రణాళికతో ప్రజల్లోకి వెళ్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. బాలోత్సవ్ భవనంలో వివిధ రంగాల మేధావులు, ప్రముఖులతో ప్రజా ప్రణాళికపై శుక్రవారం సమాలోచన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం స్వతంత్రంగా విస్తరించేందుకు కృషి చేస్తామని, వామపక్ష, ప్రజాతంత్ర శక్తులతో కలసి పని చేస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ప్రజా ప్రణాళికను మరింత పరిపుష్టం చేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా చర్చా వేదికలు నిర్వహించాలని పలువురు వక్తలు కోరారు. చెన్నుపాటి వజీర్, కొండలరావు, పరిమి, వసుంధర, చలువాది మల్లికార్జునరావు తదితరులు మాట్లాడారు.

కొండ ప్రాంతంలో విద్యుత్ లైన్లకు మరమ్మతులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా 47వ డివిజన్ కొండ ప్రాంతంలో చెట్లు కూలి విద్యుత్ లైన్లపై పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు సమస్యను కార్పొరేటర్ గోదావరి గంగ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ మేరకు విద్యుత్ అధికారులు సిబ్బందిని పంపించగా వారు విరిగిపడిన చెట్ల కొమ్మలను తొలగించి కరెంట్ లైన్లకు మరమ్మతులు చేపట్టారు. డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు గోదావరి బాబు, ఆర్.క్రాంతి కుమార్ దగ్గర ఉండి విద్యుత్ సిబ్బందికి సహకరించారు.

కొండ ప్రాంతాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- 51వ డివిజన్‌లో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం



అభివృద్ధి వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న వెలంపల్లి, కార్పొరేటర్ రాజేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంతాల అభివృద్ధికి తమ ప్రభుత్వం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహించామని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా 51వ డివిజన్ 165వ సచివాలయం ఆవరణలో జరిగిన సభలో వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్‌తో కలిసి సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలు, లబ్ధిదారుల సంఖ్య తదితర అంశాలతో కూడిన బోర్డును ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ విజయవాడ నగరాభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వందల కోట్ల రూపాయలను కేటాయించి అండగా నిలిచిందన్నారు. ప్రధానంగా పశ్చిమ నియోజకవర్గంలో కొండ ప్రాంతాలు అధికంగా ఉన్నాయని, ఆ ప్రాంతాల్లో మంచినీటి పైప్‌లైన్లు పూర్తిగా దెబ్బతింటే వాటిని మార్పు చేసేందుకు కోట్లాది రూపాయాలతో పనులను చేపట్టామన్నారు. కొండ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, మెట్ల మరమ్మతులతో పాటుగా వివిధ మౌలిక సదుపాయాల కల్పనకు అనేక చర్యలు తీసుకున్నామన్నారు. 51వ డివిజన్‌లోనూ కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించినట్లు వివరించారు. అనంతరం మరుపిళ్ల రాజేష్ కార్యాలయం సమీపంలో పార్టీ పతాకాన్ని వెలంపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు కొరగంజి భాను, దుర్గారావు, ముక్క రమణ, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

46వ డివిజన్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్'

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నగరంలోని 46వ డివిజన్‌లో సచివాలయం వద్ద శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి విచ్చేశారు. తొలుత సచివాలయం వద్ద సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఏ మేరకు లబ్ధి పొందారనే వివరాలతో ఏర్పాటు చేసిన బోర్డును ఎమ్మెల్యే, మేయర్ ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఊరేగింపుగా కేటీ రోడ్డులో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పార్టీ నాయకులు, అభిమానులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి రాయన నరేంద్ర, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, డివిజన్ అధ్యక్షుడు వెన్నం రజనీకుమార్, డివిజన్ మైనార్టీ అధ్యక్షుడు షేక్ ఆదిల్, ట్రాక్టర్ రాముతో పాటు వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న వీఎంసీ సీఈ ప్రభాకర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో రోడ్లను పరిశీలించి బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని వీఎంసీ సీఈ ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో శుక్రవారం ఆయన వీఎంసీ, పోలీస్, ఆర్‌అండ్‌బీ ట్రాన్స్‌పోర్ట్, నేషనల్ హైవేస్, ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా శాఖలు సమన్వయంతో నగరంలోని ప్రతి సర్కిల్లో రోడ్డు ప్రమాదాలకు గురయ్యే ప్రదేశాలు (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు అవసరమయ్యే చర్యలు, వేగ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు, పాదచారుల కోసం జీబ్రా లైన్లు, స్కూల్స్, హాస్పిటల్స్, పవిత్ర స్థలాలు ఉన్నచోట వాటిని సూచించే సైన్ బోర్డులు ఏర్పాట్లు చేశామని అధికారులు ఆయనకు వివరించారు. నగరంలోని ఏఏ ప్రాంతాల్లో బస్సు షెల్టర్లు అవసరమో గుర్తించి, వాటిని ఏర్పాటు చేయాలని సీఈ ప్రభాకర్ సూచించారు. సమావేశంలో ఏపీఎస్‌ఆర్టీసీ డెప్యూటీ మేనేజర్ ఎ.వెంకటేశ్వర రావు, ఏపీ పీటీడీ డెప్యూటీ సీటీఎం బషీర్ అహ్మద్, ఆర్‌అండ్‌బీ డీఈఈ వై.శశిభూషణ్, నేషనల్ హైవే ఇంజినీర్ ఎం.వి. నాగేశ్వరరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అబ్దుల్ సలాం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డీసీపీ జుబిన్ సైరన్ రాయ్, డీసీపీ-1 భాస్కర్ బాబు, ఏసీపీ పి.మోహన్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.నారాయణ మూర్తి, వి.శ్రీనివాస్, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ వి.నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ అక్కినేని మణి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రతి మహిళ తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని అక్కినేని ఉమెన్స్ హాస్పిటల్స్ చైర్‌పర్సన్, ప్రముఖ మహిళా వైద్య నిపుణురాలు డాక్టర్ అక్కినేని మణి అన్నారు. కేబీఎన్ కళాశాల యూజీసీ ఉమెన్స్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులకు, మహిళలకు వైద్య పరీక్షలతో పాటుగా మహిళా ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అక్కినేని మణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏదోక వ్యాధి వచ్చినప్పుడే ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలను చేయించుకుంటున్నారని, అయితే ఒక వయస్సు వచ్చిన తరువాత ప్రతి ఒక్కరూ జనరల్ హెల్త్ చెకప్‌లను చేయించుకోవటం ద్వారా ఏదైనా సమస్య ఉంటే ముందుగా గుర్తించటానికి అవకాశముంటుందన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం సైతం సమస్యలకు దూరంగా ఉంటుందన్నారు. ప్రధానంగా ఇటీవలి ఆహారపు అలవాట్లు, జీవనశైలి కారణంగా చాలా అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయన్నారు. పౌష్టికాహారం, వ్యాయామం, క్రమశిక్షణాయుత జీవనశైలితో ఆరోగ్యంతో పాటుగా చక్కని విజయాలను సైతం అందుకోవచ్చని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థినులు ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. ఆయుర్వేద శిబిరాన్ని సైతం నిర్వహించారు. కార్యక్రమాన్ని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ వి.శైలజ నిర్వహించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి, వైద్య నిపుణులు డాక్టర్ ధర్మజ దండమూడి, డాక్టర్ సౌమ్య దావులూరి, డాక్టర్ స్ఫూర్తి రామినేని, డాక్టర్ ఎం.సుస్మితరెడ్డి, డాక్టర్ పద్మజ రుద్రరాజు తదితరులు ఆయా అంశాలపై ప్రసంగించారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



లక్ష కుంకుమార్చనలో ఉభయదాతలు

ఆర్జిత సేవలకు డిమాండ్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల సన్నిధిలో శుక్రవారం భక్తుల రద్దీ కనిపించింది. కార్తిక మాసం, శుక్రవారం నేపథ్యంలో తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి ఆదిదంపతులను దర్శించుకున్నారు. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, శ్రీచక్ర నవార్చన, లక్ష కుంకుమార్చన, చండీహోమం, శాంతి కల్యాణోత్సవంలో పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వారికి అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు క్యూలైన్లను పర్యవేక్షించారు. అమ్మవారి మహా నివేదన సమర్పించిన అనంతరం భక్తుల రద్దీ మరింత పెరిగింది. సాయంత్రం పంచహారతుల సేవతో పాటు ఊంజల్ సేవ, దీపార్చన సేవలోనూ ఉభయదాతలు భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



నడవలేని స్థితిలో సైతం భవాని మాల ధరించి అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తుడు

కుటుంబ కథాచిత్రాల దర్శకుడు విశ్వనాథ్



దర్శకుడు విశ్వనాథ్‌కు స్వరాంజలి సమర్పిస్తున్న గాయనీ గాయకులు

విజయవాడ కల్చరల్: కుటుంబ కథా చిత్రాల దర్శకుడు కె.విశ్వనాథ్ అని సీనియర్ గాయని మల్లాది స్వాతి అన్నారు. రాగలహరి సాంస్కృతిక సేవా సంస్థ, ఫ్రెండ్స్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో గాంధీనగర్ కొతా పూర్ణానందం కళావేదికపై శుక్రవారం విశ్వనాథ్ చిత్రాల స్వరాంజలి కార్యక్రమం నిర్వహించారు.

మల్లాది స్వాతి మాట్లాడుతూ సంగీత, సాహిత్యాల మేళవింపు విశ్వనాథ్ చిత్రాలు అని అభివర్ణించారు. గాయకుడు సయ్యద్ ఆలీ మాట్లాడుతూ తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తీసుకువచ్చిన దర్శకుడు విశ్వనాథ్ అని గుర్తుచేశారు. సాహితీవేత్త మీరా కుమార్ మాట్లాడుతూ విశ్వనాథ్ చిత్రాల పాటల్లో సాహిత్య గుబాళింపు కనిపిస్తుందని, సామాజిక చైతన్యం కలిగించిన అంశాలు ఆయన చిత్రాలలో కనిపిస్తాయన్నారు. దండు చంద్రశేఖర్, వడ్డాది కామేశ్వరి విశ్వనాథ్ నటించిన చిత్రాలలోని గీతాలను ఆలపించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, నేరెళ్ళ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డుకు సెస్ విధిగా జమ చేయాలి

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు చెల్లించాల్సిన ఒక శాతం సెస్ విధిగా జమ చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. సంబంధిత అధికారులతో శుక్రవారం ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ సెస్‌ను తక్షణమే జమ చేయాలన్నారు. భవన నిర్మాణ యజమానులు బోర్డుకు సెస్ సక్రమంగా చెల్లిస్తున్నారా? లేదా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై ప్రగతి నివేదికలు ఉప కార్మిక కమిషనర్‌కు అందజేయాలన్నారు.

రేపు గొల్లపూడిలో ఆర్యవైశ్య కార్తిక వనసమారాధన

భవానీపురం(విజయవాడపశ్చిమ): పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 10వ తేదీన ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని పద్మావతి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య వైభవం పేరుతో కార్తిక వనసమారాధన నిర్వహించనున్నట్లు పలువురు ఆర్యవైశ్య నాయకులు తెలిపారు. వాసవి ఫౌండేషన్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సంబంధించి భవానీపురంలోని హోటల్ ఆలివ్ ట్రీలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆర్యవైశ్య ఫౌండేషన్ చైర్మన్ వీవీకే నరసింహారావు మాట్లాడుతూ ఆదివారం జరిగే ఈ వనసమారాధన వేడుకల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా వివిధ పార్టీలకు చెందిన ఆర్యవైశ్య ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో ఆర్యవైశ్య నాయకులు పారేపల్లి (డూండీ) రాకేష్, కొణిజేటి రమేష్, దర్శి వాసు, నూకల నాగేశ్వరరావు, జాలాది వెంకటేశ్వరరావు, బొగ్గవరపు సత్యనారాయణ, టి.శ్రీనివాస్, చారుగుండ్ల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన



పాష్ చట్టంపై వర్కుషాప్ నిర్వహిస్తున్న ఐసీసీ సభ్యులు నుస్రత్ మండ్రుప్కర్, మాణిక్యరావు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): భారతీయ రైల్వేలో లైంగిక వేధింపుల వ్యతిరేక విధానాల అమలుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, మహిళా ఉద్యోగులకు పాష్ చట్టం-2013 (ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్‌మెంట్)పై అవగాహన కల్పించేలా వర్కుషాప్‌లు నిర్వహించనున్నట్లు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్‌ఓ, ఐసీసీ (ఇంటర్నల్ కంప్లెయింట్స్ కమిటీ) సభ్యురాలు నుస్రత్ మండ్రుప్కర్ తెలిపారు. పాష్ చట్టం అమలై పదేళ్లు అయిన సందర్భంగా శుక్రవారం డీఆర్‌ఎం కార్యాలయంలో ఈ చట్టంపై వర్కుషాప్ నిర్వహించారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ 2013, సెప్టెంబర్ 9న విశాఖపట్నం, రాజస్థాన్‌లోని కేసులకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఫలితంగా పాష్ చట్టం-2013 అమలులోకి వచ్చిందని తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని డివిజన్‌లో ప్రతి సంవత్సరం డివిజన్ ఉద్యోగులకు వర్కుషాపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పనిచేసే ప్రదేశంలో మహిళలకు భద్రత, భరోసా కల్పించడం, వేధింపులను నివారించడం, ఐసీసీకి ఫిర్యాదులు చేయడం, పాష్ చట్టం లక్ష్యాలు, అమలుపై తదితర విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మహిళలకు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ, ఐసీసీ సభ్యులు పి.మాణిక్యరావు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

జెమ్స్ అండ్ జ్యూవలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం



జ్యూవలరీ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న కపిలవాయి విజయకుమార్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ బులియన్ గోల్డ్ అండ్ సిల్వర్, డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో జెమ్స్ అండ్ జ్యూవలరీ ఫెయిర్ శుక్రవారం ప్రారంభమైంది. యునైటెడ్ ఎగ్జిబిషన్స్ సహకారంతో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎగ్జిబిషన్‌ను బులియన్ గోల్డ్, సిల్వర్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన జ్యూయలరీ ఉత్పత్తిదారులు, హోల్‌సేల్ వ్యాపారులను అభినందించారు. ఇలాంటి ప్రదర్శనలతో జ్యూయలర్స్ వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉన్న చోటునే కొనుగోలు చేసుకునేందుకు ఒక సదవకాశం అని తెలిపారు. అసోసియేషన్ చీఫ్ స్టేట్ ఆర్గనైజర్ శాంతిలాల్ జైన్, జనరల్ సెక్రటరీ బొమ్మిశెట్టి శంకరరావు, కోశాధికారి అనిల్‌కుమార్, వీకే మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలి



బాక్సింగ్‌లో పసిడి పతకం సాధించిన పవన్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రీడలలో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం బాక్సింగ్ పోటీలలో పసిడి పతకం సాధించిన పవన్‌కుమార్ అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల బాక్సింగ్ పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ సౌత్‌జోన్ పోటీలకు ఎంపికవటం అభినందనీయం అన్నారు. పవన్‌కుమార్ బాక్సింగ్‌లో పసిడి పతకం, హర్షవర్ధన్ రజత పతకం సాధించటం తమ కళాశాలకే గర్వకారణమన్నారు. కళాశాల వ్యాయామ విద్య విభాగం అధ్యాపకులు మండవ కోటేశ్వరరావు, డి.యుగంధర్ మాట్లాడుతూ చండీఘర్ యూనివర్సిటీ సౌత్‌జోన్ పోటీలలో కూడా సత్తా చాటాలని ఆకాంక్షించారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నిరుద్యోగ యువతులకు బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు వున్న మహిళలు ఈ కోర్సులో శిక్షణ పొందడానికి అర్హులని పేర్కొన్నారు. పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఈ నెల 15వ తేదీ లోగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 98499 53533 నంబరులో సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

ప్రేమ పేరుతో యువతికి వేధింపులు

యువతి తల్లిదండ్రులపై దాడి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రేమ పేరుతో యువతిని వేధించడమే కాకుండా ఆమెతో తన పెళ్లి జరిపించాలంటూ ఆ యువతి తల్లిదండ్రులపైనే ఓ యువకుడు దాడికి పాల్పడిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం దావు బుచ్చయ్యకాలనీకి చెందిన కుప్పిలి వంశీ(22) టైల్స్ పనులు చేస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన యువతి(19)ని గత కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నాడు. అతని చేష్టలకు భయపడిన తల్లిదండ్రులు తమ కుమార్తెను రెండు నెలల క్రితం విజయనగరంలోని వాళ్ల అమ్మమ్మ ఇంటికి పంపారు. దీంతో గురువారం రాత్రి వంశీ ఆ యువతి తల్లిదండ్రుల ఇంటికి వచ్చి మీ కూతురిని నాకు ఇచ్చి పెళ్లిచేస్తారా లేదా అంటూ రాద్ధాంతం చేసి వారిపై దాడికి పాల్పడ్డాడు. దీంతో గాయాలపాలైన తల్లిదండ్రులిద్దరూ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భర్త వేధింపులపై భార్య కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపాలెంగట్టు కస్తూరిబాయి ఆశ్రమం ప్రాంతానికి చెందిన బేబి హజారా, పోతిన హేమంత్‌సాయి భార్యభర్తలు. వీరిది ప్రేమ వివాహం. వీరికి ఒక పాప సంతానం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే హేమంత్‌సాయి కొంత కాలంగా భార్యను అనుమానంతో వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కుమార్తె ఇంటి నుంచి కుమారుడి ఇంటికి బయలుదేరిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టేనర్‌పేట బూస్టర్ వద్ద జి.రామలక్ష్మి, శేషు దంపతులు నివాసం ఉంటున్నారు. దేవీనగర్‌లో నివాసం ఉంటున్న తండ్రి కె.తవిటి నాయుడు గత నెల 26వ తేదీన కుమార్తె రామలక్ష్మిని చూసేందుకు వచ్చాడు. ఈ నెల 2వ తేదీన రామలక్ష్మి ఇంటి నుంచి బయలుదేరిన తవిటినాయుడు కుమారుల వద్దకు చేరలేదు. దీంతో కుమార్తె కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

ప్రకటన

మా క్లయింటును గుంటూరు జిల్లా, మంగళగిరి వాస్తవ్యులైన గార్లపాటి శివనాగేశ్వరరావు గారి కుమారుడు అయిన గార్లపాటి వెంకట ప్రసాద్‌గారి సంజాయిషీపొంది అందరికీ తెలియజేయునది ఏమనగా..

ఎన్.టి.ఆర్.జిల్లా విజయవాడ వన్‌టౌన్ వట్టూరివారి వీధి కాపురస్తులైన వజ్ఞాలయలు గారి కుమారుడు శ్రీనివాస్ గారికి వారి తండ్రి గారైన వజ్ఞాలయలుగారు 03-03-2004వ తేదిన ఒక సెటిల్‌మెంట్ దస్తావేజును వ్రాయించి దానిని విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసులో 2755/2004 దస్తావేజుగా రిజిస్టరు కాబడిన సెటిల్‌మెంటు దస్తావేజు రీత్యా సదరు శ్రీనివాస్‌గారికి ఈ దిగువ షెడ్యూల్ దాఖల బిల్డింగు సంక్రమించగా అందలి అవిభక్తమైన 20 చ॥గ॥ స్థలము అందలి గ్రౌండు ఫ్లోరు మాత్రము ఇతరులకు విక్రయించి మిగిలిన 48.90 చదరపు గజముల ఆస్తిని 1వ, 2వ ఫ్లోర్ల కట్టడములను తన యొక్క సర్వసంపూర్ణ హక్కుభుక్తములతో అనుభవించుచూ సదరు ఆస్తిలోని అవిభక్తమైన 20 చ॥గ॥లను మరియు 1వ ఫ్లోరు కట్టడములను మా క్లయింటుకు విక్రయించుటకు ఖరారుపడి వారి నుండి అడ్వాన్సు క్రయప్రతిఫలమును తీసుకొని ఉండిరనియు, ప్రస్తుతము మా క్లయింటు సదరు వారికి బ్యాలెన్స్ క్రయ ప్రతిఫలమును చెల్లించి వారి నుండి విక్రయ దస్తావేజును పొందుటకు సిద్ధముగా ఉండిరనియు, సదరు క్రయము గురించి ఎవరికైన ఎటువంటి అక్షేపణలు ఉన్ననూ, సదరు షెడ్యూల్ ఆస్తిపై ఎవరికైన చెల్లదగిన తనఖా, విక్రయ ఎగ్రిమెంటు, అప్పు, ఇంజక్షన్, మనోవర్తి జాయింటు భాగముల తగాదా, వగైరా క్లయిములు ఉన్ననూ, సదరు క్రయము గురించి ఎవరికైన అక్షేపణలు ఉన్ననూ, సదరు అక్షేపణలను, క్లయిములనూ ఈ ప్రకటన వెలువడిన 15 రోజులలోగా వ్రాతపూర్వకముగా రిజిస్టరు పోస్టు ద్వారా మాకు తెలియబరచవలయుననియు గడువులోపల ఎటువంటి క్లయిములు, అక్షేపణలురాని యెడల సదరు షెడ్యూలు ఆస్తిని నిస్సేరి ఆస్తిగా తీర్మానించుకొని విక్రయ దస్తావేజును పొందుదురనియు ఆ దరిమిల వచ్చే క్లయిములు, అక్షేపణలు మా క్లయింటును ఎంతమాత్రం బైండు చేయజాలవనియు అందరికిని తెలియబరచటమైనది.

షెడ్యూల్: ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి యిలాఖా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన విజయవాడ నగరం, 1టౌన్, వట్టూరి వారి వీధిలోగల అసెస్మెంటు నెం. 1073023039రు డోరు నెం. 11-11-6రు గల ఆస్తికి హద్దులు: **తూర్పు:** గ్రంధి బుల్లయ్య గారి ఆస్తి వెంబడి యీ ఆస్తి ప్రహరీ గోడ అ. 15-1 1/2లు; **దక్షిణం:** చందులూరి సీతారామమూర్తి గారి ఆస్తి అ. 41-0లు; **పడమర:** వట్టూరి వారి వీధి అనే మున్సిపల్ రోడ్డు అ. 15-1 1/2లు; **ఉత్తరం:** వజ్జా ఏడుకొండలరావు గారి ఆస్తి హద్దు అ. 41-0లు. ఈ నాలుగు హద్దుల మధ్య చ॥గ॥ 68.90 స్థలములో నిర్మితమైన గ్రౌండు, 1వ, 2వ ఫ్లోర్లలు బిల్డింగులోగల ఆస్తిలో అవిభక్తమైన చ॥గ॥ 20లు స్థలము మరియు ఫస్టు ఫ్లోరు మొత్తము కట్టడములతో సహాగల ఆస్తి.

— ఇట్లు —

సి.హెచ్. దామోదర రావు, శ్రీమతి సురేఖ, జి.వి. శ్రీనివాస్, నందిపాటి విఠల్ కుమార్, వి.యస్.ఎల్. మాధుర్య న్యాయవాదులు, డో.నెం. 11-11-8, వట్టూరివారి వీధి, విజయవాడ-1 ✆ 9393999545